కియోస్క్ సేవలకు గ్రహణం

- రైతు సేవా కేంద్రాల్లో నిరుపయోగంగా కియోస్క్ యంత్రాలు
- అన్నదాతలకు అందని సేవలు
- ఎరువులు, పురుగు మందులు అందక ఇక్కట్లు
- ప్రైవేట్ దుకాణాల్లో అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి




గోనెగండ్లలో రైతు సేవా కేంద్రం, నిరుపయోగంగా కియోస్క్ డిజిటల్ యంత్రం

గోనెగండ్ల : రైతులకు అన్ని రకాల సేవలు ఇంటి ముంగిటకే అందేలా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇందు లో వ్యవసాయ అనుబంధ రంగాల వస్తువులు, పశువుల దాణా, మార్కెటింగ్ వంటి అన్ని రకాల సేవ లు పారదర్శకంగా అందించేందుకు కియోస్క్(డిజిటల్ టచ్ స్క్రీన్) యంత్రాలు ఏర్పాటు చేసింది. అ యితే కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సీఎం చంద్రబాబు రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా మార్పు చేశారు. రైతులకు సేవలందించే కియోస్క్ యంత్రాలను మూలన పడేశారు. గత కొన్ని నెలలుగా అవి నిరుపయోగంగా ఉండటంతో రైతుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

డిజిటల్ కియోస్క్‌ల ప్రత్యేకతలు

ప్రతి రైతు భరోసా కేంద్రంలో డిజిటల్ కియోస్క్ ఏర్పాటు చేశారు. ఇది ఆండ్రాయిడ్ సాంకేతిక పరిజ్ఞానంతో నడిచే యంత్రం. ఈ కేంద్రాల్లో డిజిటల్ విధానంలో నూతన ఆవిష్కరణలతో రైతులకు సేవలు అందించేందుకు గత ప్రభుత్వం రూ.లక్షలు వ్యయం చేసి వాటిని కొనుగోలు చేసింది. ఇందులో వ్యవసాయ ఉత్పాదకాలను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే సౌకర్యంతో పాటు వివిధ ప్రాంతాల్లో ఉన్న రక రకాల వ్యవసాయ ఉత్పత్తులపై మార్కెటింగ్ ధరలు అందుబాటులో ఉంటాయి. పంట యాజమాన్య పద్ధతులపై సమాచారం వీడియో రూపంలో పొందుపరిచారు. ఈ యంత్రాలతో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, వ్యవసాయ యంత్రాలు, రైతులు ఉత్పత్తి చేసేటప్పుడు ఉన్న మార్కెట్ ధరలు, దగ్గరలో ఉన్న మార్కెట్ వివరాలు తదితర అవసరమైన అన్ని సేవలూ ఈ యంత్రం ద్వారా పొందే అవకాశం ఉంది. వాతావరణ సమాచారం, మార్పులు ఏ సమయంలో ఏ పంటలు వేయాలన్న సమగ్ర సమాచారాన్ని ఇందులో పొందుపరిచి రైతులకు అందించారు.

కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం

గోనెగండ్ల మండలంలో 23 రైతు సేవాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత అన్ని రైతు సేవా కేంద్రాల్లో కియోస్క్ యంత్రాలు నిరుపయోగంగా మారాయి. కనీసం ఎరువులు బుక్ చేసుకునేందుకు కూడా వినియోగించుకోకపోవడంతో రూ.లక్షల ప్రజాధనం వృథా అవుతోంది. గతంలో రైతులు ఎరువులు, విత్తనాలు, మందులు తదితర వాటికి కియోస్క్‌ల ద్వారా ఇండెంట్ పెడితే సరఫరా చేసేవారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ పూర్తయి రబీ సీజన్ ప్రారంభమైనా వీటిని వినియోగించకపోవడంతో ఆ సౌకర్యాలు రైతులు పొందలేకపోతున్నారు. అలాగే యాజమాన్య పద్ధతులను తెలుసుకోవాలన్నా, మార్కెట్ ధరలు, ఇతర సమాచారం తెలుసుకునే వీలు లేకుండా పోయింది. ఇదిలా ఉండగా గతంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు పూర్తిస్థాయిలో పంపిణీ చేసేవారు. కూటమి ప్రభుత్వంలో మొక్కుబడిగా ఎరువులు అందిస్తున్నారు. దీంతో రైతులు ప్రైవేట్ డీలర్ల వద్ద అధిక ధరలకు ఎరువులు కొనుగోలు చేసుకుంటున్నారు.

సేవలు కొనసాగించాలి



గత ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించేవారు. వ్యవసాయ యంత్రాలు పంటల ఉత్పత్తి, మార్కెట్ వివరాలు వంటి సమాచారం రైతులకు డిజిటల్ కియోస్క్ సేవలు అందించేవారు. గతంలో అందుతున్న సేవలను ఇప్పుడు కొనసాగించాలి.

– వెంకట్రామిరెడ్డి వైస్ ఎంపీపీ, అలువాల గ్రామం

పూర్తిస్థాయిలో అందించాలి



రైతుసేవా కేంద్రాల ద్వారా ఎరువులు పూర్తిస్థాయిలో రైతులకు అందించాలి. ఈ ఖరీఫ్‌లో రైతులకు అవసరమైన ఎరువులను కూటమి ప్రభుత్వం అందించలేకపోయింది. ఎరువుల కోసం ప్రైవేట్ డీలర్ల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తరహాలోనే రైతులకు అవసరమైన ఎరువులు, అన్ని రకాలు సేవలు అందించాలి.

– ఎస్‌బీ మన్సూర్, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్, గోనెగండ్ల

క్లుప్తంగా

పారిశ్రామిక రంగాలపై అవగాహన ఉండాలి



ఇండస్ట్రియల్ విజిట్‌లో నెహ్రూమెమోరియల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

ఆదోని సెంట్రల్: పారిశ్రామిక రంగాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని బీఐఎస్ ప్రతి నిధులు ముకేష్, మారుతి ఇస్పాత్ కంపెనీ మేనేజర్ రాజు అన్నారు. గురువారం బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్(బీఐఎస్) ఆధ్వర్యంలో నెహ్రూమెమోరియల్ ఉన్నత పాఠశాల విద్యార్థులు మాధవరం సమీపంలోని మారుతీ ఇస్పాత్ ఎనర్జీ ప్రైవేట్ కంపెనీని సందర్శించారు. విద్యార్థులకు వివిధ ఖనిజాల నుంచి ఐరన్ తయారు చేసే విధానం, ముడి సరకు, దాని ప్రమాణాలు పరీక్షించే విధానాలను వివరించారు. క్లబ్ శిక్షకులు సుధాకర్, ఉపాధ్యాయులు కళ్యాణి, సువేద, శ్యామల, శ్వేతబాయి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్యారతారీఖ్ వేడుకలు



స్వామి వారి సమాధి వద్ద ప్రార్థనలు చేస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో గురువారం గ్యారతారీఖ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక ఫాతెహాలను, ప్రార్థనలను జరుపుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్టీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్టీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలను చేపట్టారు.

17న వాల్మీకి వనభోజన కార్యక్రమం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని గ్లోబల్ ఇండస్ స్కూల్‌లో ఈనెల 17న వాల్మీకి వనభోజన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వాల్మీకి సంఘ నాయకులు వెంకటేష్, కొండయ్య, బీఎల్ నారాయణ, దయాసాగర్, రామకృష్ణ, రంగన్న తెలిపారు. గురువారం స్థానిక వాల్మీకి సంక్షేమ భవన్ స్థల ఆవరణలో వాల్మీకి వన భోజన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమానికి వాల్మీకులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

నేడు సాయి మందిరం 9వ వార్షికోత్సవం

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని ఉరుకుంద క్రాస్ రోడ్డులో వెలసిన శ్రీ షిరిడీ సాయి బాబా మందిరం 9వ వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు సాయి ఋత్విక్ గట్టు రమేష్, సాయి సేవక్ పాండురంగ గురువారం తెలిపారు. కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని శుక్రవారం వేకువ జామున నుంచి కాకడ హారతి, సుప్రభాతం, అభిషేకములు, ఉచిత సామూహిక సాయి సత్యవ్రతాలు, చందనోత్సవం తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు.

వలస వెళ్లకండి ఉపాధి కల్పిస్తాం

మంత్రాలయం: మండలంలోని ప్రజలు ఎవరూ వలసలు వెళ్లకూడదని సొంత గ్రామాల్లోనే ఉపాధి పనులు కల్పిస్తామని ఏపీఓ తిమ్మారెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని చిల కలడోణ, సింగరాజనహళ్లి గ్రామాల్లో ఉపాధి పనులపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ అధిక కూలీ డబ్బుల కోసం సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్లి ఇబ్బందులు పడొద్దని, డబ్బుల కోసం విద్యార్థులను నిరక్షరాస్యులుగా మార్చొదని కోరారు. కార్యక్రమంలో ఈసీ సూర్యప్రకాష్, మధుసూదన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

పాఠశాల వద్ద చెత్తను తొలగించాలి



పాఠశాల వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారం

ఆదోని రూరల్: మండలంలోని ధణాపురం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వద్ద వేసిన చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించాలని డీవైఎఫ్ఐ మండలాధ్యక్షుడు గోవింద్ డిమాండ్ చేశారు. గురువారం వారు పాఠశాల వద్ద పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ పాఠశాల వద్ద చెత్తాచెదారం పేరుకుపోవడంతో దోమలు, పందులు స్వైర్య విహారం చేస్తున్నాయన్నారు. దీంతో విద్యార్థులు అనారోగ్యాలకు గురవుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు నరసింహులు, వీరేష్, హెబ్బటం నరసింహ పాల్గొన్నారు.

అనారోగ్యంతో ఎంపీటీసీ మృతి



ఎంపీటీసీ కొమ్ము సరస్వతి (ఫైల్)

ఆదోని రూరల్: మండలంలోని ఇస్వీ గ్రామానికి చెందిన ఎంపీటీసీ కొమ్ము సరస్వతి(50) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఈమె వైఎస్సార్‌సీపీ నుంచి గెలుపొంది ఇస్వీ, కడితోట, జి.హొసళ్లి గ్రామాలకు ఎంపీటీసీగా సేవలు అందించారు. నెల రోజులక్రితం ఆమె అనారోగ్యానికి గురికావడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు భర్త అరికేశప్ప తెలిపారు. ఆమె భౌతికకాయాన్ని స్వగ్రామమైన ఇస్వీకి తరలించారు. శుక్రవారం దహన సంస్కారాలు నిర్వహిస్తామన్నారు. మృతురాలికి కుమార్తె రాజేశ్వరి ఉన్నారు. ఆమె మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.

గ్రామాభివృద్ధి ప్రణాళికలో భాగస్వాములు కావాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీవో నూర్జహాన్

ఆదోనిరూరల్: 15వ ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాలని, గ్రామాభివృద్ధి ప్రణాళికలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని డీఎల్‌పీవో నూర్జహాన్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై ప్రజాప్రతినిధులకు, వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, ఏపీడీ లోకేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక కావాలంటే నమోదు చేసుకోవాలి



మాట్లాడుతున్న తహసీల్దారు, మైనింగ్ అధికారి

కౌతాళం: ఉచిత ఇసుక కావాలంటే సచివాలయాల్లో నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని జిల్లా మైనింగ్ విజిలెన్స్ టెక్నికల్ అసిస్టెంట్ బాలనాయక్, తహసీల్దారు మల్లికార్జున తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉచిత ఇసుక విధానంపై కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మైనింగ్ అధికారి మాట్లాడుతూ మండలంలో ఇసుక కావాల్సిన వారు తమ గ్రామాల్లోని సచివాలయాల్లో ముందుగా తమ చిరునామాతో పాటు ఏ వాహనంలో ఇసుకను తరలిస్తారో ఆ వాహనం నంబర్, డ్రైవర్ పేరు సెల్ నెంబర్ నమోదు చేయించి రసీదును పొందాలన్నారు. ఇసుక రీచ్‌లలో ఆ రసీదు చూపించి టన్నుకు రూ.119 చెల్లించి ఇసుకను తీసుకోవచ్చని చెప్పారు. సమావేశంలో సీఐ అశోక్‌కుమార్, డిప్యూటీ తహసీల్దారు రజినీకాంత్‌రెడ్డి, ఏఓ సత్యన్న, కార్యదర్శులు పాల్గొన్నారు.

కేజీబీవీ ప్రిన్సిపాల్‌ను విధుల నుంచి తొలగించాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న స్థానిక కేజీబీవీ ప్రిన్సిపాల్ కవితను విధుల నుంచి తొలగించి మళ్లీ పోస్టింగ్ ఇవ్వడం శోచనీయమని, ఆమెను సత్వరం తొలగించాలని విద్యార్థి సంఘాల నాయకులు నరసన్న, శేఖర్, మహేంద్రబాబు, వీరేష్‌యాదవ్, సురేంద్రబాబులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్ వీరభద్ర గౌడ్‌కు ఇచ్చారు. వారు మాట్లాడుతూ విద్యార్థుల ఆకలికేకలకు కారణమైన ప్రిన్సిపాల్‌ను విధుల నుంచి తొలగించి మళ్లీ అదే పాఠశాలలో విధులు నిర్వర్తించేలా ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇవ్వడం సరైందికాదన్నారు. ప్రిన్సిపాల్‌ను తొలగించకపోతే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణ, రఘునాథ్, అజిత్, చాంద్‌బాషా ,చరణ్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుడికి మాజీ ఎమ్మెల్యే నివాళి



చేనేత కార్మికుడు వెంకటరామప్ప మృత దేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని మాత్రాల తిమ్మప్ప కాలనీకి చెందిన సీనియర్ చేనేత కార్మికుడు జక్కా వెంకటరమప్ప(95) అనారోగ్యంతో గురువారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి ఆయన నివాసానికి వెళ్లి పార్థీవ దేహానికి నివాళులర్పించారు. 20 సంవత్సరాల వయస్సు నుంచే చేనేత కార్మికుడిగా పనిచేయడంతో పాటు చేనేత పితామహుడు పద్మశ్రీ మాచాని సోమప్ప, మాచాని శివన్నల కుటుంబాలకు నమ్మిన బంటుగా పనిచేశారని ఎమ్మెల్యే గుర్తు చేశారు. అనంతరం కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మిగనూరుటౌన్: విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎంఎస్ బాలికల జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం కృష్ణమూర్తి, గ్రంథాలయాధికారి హరికృష్ణ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక గ్రంథాలయంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అడివన్న, భూలక్ష్మి, శారదాదేవి, బాలికల జూనియర్ కళాశాల అధ్యాపకులు శ్రీనివాస్, హరికుమార్ పాల్గొన్నారు.

పెద్దకడబూరు : మండల కేంద్రంలోని గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని సర్పంచ్ రామాంజినేయులు, గ్రంథాలయ అధికారిణి ఆశాజ్యోతి నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ శివన్న, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆదోని అర్బన్: ప్రతిఒక్కరూ గ్రంథాలయాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓలు రాజేంద్రప్రసాద్, శ్రీనివాసులు సూచించారు. గురువారం ఆదోనిలోని గ్రంథాలయంలో 57వ గ్రంథాలయ వారోత్సవాలను గ్రంథాలయ అధికారిణి సుజాత ఆధ్వర్యంలో ప్రారంభించారు. మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కమ్యూనిటీహాల్ ఏర్పాటుకు అనుమతివ్వండి



ఆదోనిలో సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతి పత్రం అందజేస్తున్న మాదాసి మాదారి కురువ సంఘం నాయకులు

ఆదోని రూరల్: హొళగుంద గ్రామశివారులోని కడ్లమాగి రస్తాలో కనకదాసు భవనం ఏర్పాటు చేసుకునేందుకు అనుమతినివ్వాలని మాదాసి మాదారి కురువ సంఘం నాయకులు గురువారం సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్‌కు వినతి పత్రం అందజేశారు. సంఘం తాలూకా ప్రధాన కార్యదర్శి పెద్దహ్యాట మల్లయ్య, కనక శ్రీ యూత్ నాయకుడు ఎస్.కె.గిరి మాట్లాడుతూ హొళగుంద గ్రామశివారులోని కడ్లమాగి రస్తాకు వెళ్లే రహదారిలోని సర్వేనంబర్ 373లో 30 సెంట్లు గత ఏడు సంవత్సరాలుగా అనుభవంలో ఉందని, తమ సంఘానికి సంబంధించిన అన్ని కార్యక్రమాలు ఈ స్థలంలోనే చేసుకుంటామన్నారు. ఈ భూమిని కనకదాసు ఆశ్రమం, కమ్యూనిటీహాల్ నిర్మించడానికి సర్వహక్కులు మాదాసి, మాదారి కురువ సంఘానికి వర్తించేవిధంగా పట్టా మంజూరు చేయాలని కోరారు.

క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి



సజ్జలగుడ్డంలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి మనోజ్‌కుమార్

కోసిగి: క్యాన్సర్ వ్యాధి రాకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని కోసిగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మనోజ్‌కుమార్ ప్రజలకు సూచించారు. గురువారం కోసిగి మండలంలోని సజ్జలగుడ్డం గ్రామంలో ఏఎన్ఎమ్, ఆశావర్కర్లుచే ఎన్.సి.డి.3.0 ఇంటింటా సర్వే ప్రక్రియను ప్రారంభించారు. గ్రామంలో 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరు గ్రామంలో చేసే సర్వే చేయించుకుని క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్ఓ ఈశ్వరమ్మ, ఎంపీ హెచ్ఓ శ్రీనివాసులు, ఎల్లప్ప, సూపర్ వైజర్స్ రాముడు, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక పుస్తకాల పంపిణీ



ఆధ్యాత్మిక పుస్తకాలను చూపుతున్న విద్యార్థినులు, వీహెచ్‌పీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఎంఎస్ బాలికల జెడ్పీ హైస్కూల్‌లో గురువారం వీహెచ్‌పీ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు అర్దగేరి బసన్న గౌడ్, బీమరెడ్డిలు విద్యార్థినులకు అధ్యాత్మిక పుస్తకాలను పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ టీటీడీ వారి భగవద్గీత పుస్తకాలు విద్యార్థులకు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో శ్రీరామ్‌యాదవ్, సత్యనారాయణరెడ్డి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దు



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ గంటా సుబ్బారావు

ఆదోని అర్బన్: దుకాణాల ముందు రోడ్డును ఆక్రమించుకొని ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దని ట్రాఫిక్ సీఐ గంటా సుబ్బారావు దుకాణ యజమానులను హెచ్చరించారు. గురువారం వాహనాల తనిఖీలో భాగంగా స్థానిక ఎమ్మిగనూరు రోడ్డులోని కంట్రోల్ రూమ్ నుంచి పాత బస్టాండ్ వరకు రోడ్డుకు ఇరువైపులా రోడ్డును ఆక్రమించుకుని ఉన్న వ్యాపారులు, వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. వెంటనే దుకాణాల ముందు రోడ్డుపై పెట్టిన వస్తువులను, అడ్డంగా పెట్టిన వాహనాలను తీసివేయాలని అవగాహన కల్పించారు. వాహనాలను తనిఖీ చేస్తూ రికార్డులు సరిగా లేని వాహనాలకు జరిమానాలు విధించారు.

మాదిగల ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

పెద్దకడబూరు : ఈ నెల 18న కర్నూలులో జరగనున్న మాదిగల ఆత్మీయ సమ్మేళన సదస్సును జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు యువరాజు, సతీష్ పిలుపునిచ్చారు. స్థానిక సచివాలయం–2 ఆవరణలో గురువారం పోస్టర్లను విడుదల చేశారు. సదస్సుకు మాదిగ, ఉప కులాలు, ప్రజలు, నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జయన్న, శాంతిరాజు, ముక్కరన్న, అర్లప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై భారం మోపడం తగదు



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ఆదోనిరూరల్ : రాష్ట్ర ప్రభుత్వం పేదలపై ఆర్థిక భారం మోపడం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.వెంకటేశులు అన్నారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట గురువారం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి నేతలు సూపర్‌సిక్స్ హామీలను అధికారంలోకి వచ్చాక అమలు చేయడంలో ఘోరంగా విఫలమయ్యారన్నారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు బి.మహానందరెడ్డి, పాండవగల్ సర్పంచ్ కె.ఉమాదేవి, డి.రామాంజనేయులు, ఎం.ఉచ్చీరప్ప తదితరులు పాల్గొన్నారు.

కౌతాళం: సీపీఎం సీనియర్ నాయకుడు మల్లయ్య, మండల కన్వీనర్ ఈరన్న ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఉలిగయ్య, వీరేష్, హుసేని, ఈరన్న పాల్గొన్నారు.

మంత్రాలయం: సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు ఎం.డి.అంజిబాబు తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్‌యాదవ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు జయరాజు, ప్రాణేష్,సురేష్, అంజి., ఇబ్రాయిల్, రాజు, తిక్కన్న, ఆంజినేయులు తదితరులు ఉన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు రామాంజినేయులు, పట్టణ కార్యదర్శి గోవిందు ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి వినతిపత్రాన్ని తహసీల్దార్ శేషఫణికి ఇచ్చారు. నాయకులు లక్ష్మీనర్సయ్య, అబ్దుల్లా, విజయ్, యాసీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం



మాట్లాడుతున్న జడ్జి యజ్ఞ నారాయణ

ఆదోని రూరల్: నేటి బాలలే రేపటి పౌరులని ఆదోని సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ అన్నారు. గురువారం సాయంత్రం ఆదోని పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ విద్యార్థులు ఎన్ని ఆటంకాలు ఎదురైనా అధిగమించాలన్నారు. బాగా చదువుకుని జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. న్యాయవాదులు ఆనంద్, లోకేష్‌కుమార్, నరేష్, హెచ్ఎం, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదోని అర్బన్: ఆదోని అవోపా, వామ్, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని బార్‌పేట పురపాలక ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్కూల్ పిల్లలకు విలువైన నోటు పుస్తకాలు, పెన్నులు, కలరింగ్ కిట్లు, మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో అవోపా, వామ్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.రఘు, లయన్స్ క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు ధర్మారెడ్డి, కోశాధికారి శంకరమ్మ, లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్‌లు డా.గోపీనాథ్, ప్రసాద్‌రావు, సభ్యులు పాల్గొన్నారు.

ఆదోని సెంట్రల్: పట్టణంలోని భాష్యం-2 పాఠశాలలో పాఠశాల అసిస్టెంట్ ఈఓ మాచని కవిత, ప్రిన్సిపాల్ రవి ప్రకాష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి డీఎస్పీ సోమన్న ముఖ్య అతిథిగా హాజరై వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పట్టణంలోని కిలిచిన్‌పేట పురపాలక ప్రైమరీ పాఠశాలలో హెచ్ఎం సునిల్ రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు పండిట్ జవహర్ లాల్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అలాగే సెయింట్ అంథోని, విందృశ్రీ, మిల్టన్ గ్రామర్ పాఠశాలల్లో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

ఎమ్మిగనూరు: పట్టణంలోని భాష్యం ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో ప్రిన్సిపాల్ మాచాని కవిత ఆధ్వర్యంలో బాలల దినోత్సవాన్ని జరుపుకున్నారు. రిటైర్డ్ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్, చిన్న పిల్లల డాక్టర్ బాలయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

కోసిగి: మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ సమీరా రెడ్డి, బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఖలీల్ అహ్మద్, మౌంట్ కార్మెల్ స్కూల్‌లో ఫాదర్ జాన్సన్, చౌడేశ్వరి స్కూల్‌లో హెచ్ఎం కృష్ణమూర్తి, చైతన్య స్కూల్‌లో లక్ష్మన్నల ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలు నిర్వహించారు.

కౌతాళం: మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రతిభ హైస్కూల్‌లో కరస్పాండెంట్ దూద్‌బాష ఆధ్వర్యంలో జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

గోనెగండ్ల : స్థానిక ఏపీ మోడల్ స్కూల్‌లో బాలల దినోత్సవం సందర్భంగా ఎంఈఓ రామాంజినేయులు, నీలకంఠ నెహ్రూ చిత్రపటానికి పూలవేసి నివాళులర్పించారు. టల్ టిన్కరింగ్ ల్యాబ్స్‌లో విద్యార్థులు వివిధ నమూనాలను ప్రదర్శించారు. వాటిని పరిశీలించి సర్టిఫికెట్స్, మెమోంటోలను ప్రదానం చేశారు.

ఎమ్మిగనూరు టౌన్: స్థానిక మాచాని సోమప్ప బాలికల ఉన్నత పాఠశాలతో పాటు నారాయణ, పలు ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమంలో పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి ప్రధానోపాధ్యాయుడు కృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ సురేష్ కుమార్, ఏఓ జాకీర్‌హుసేన్, ఉపాధ్యాయినులు పూలమాల వేసి నివాళులర్పించారు.

నందవరం: మండల కేంద్రంలోని ఎంపీపీ స్పెషల్ స్కూల్‌లో ఎంఈఓ-2 రఘునాథ్ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేసి చిన్నారులకు తినిపించారు. విద్యార్థులకు క్రీడ పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

పంచాయతీ ఆదాయన్ని పెంచాలి

గోనెగండ్ల: గ్రామ పంచాయతీలో వర్మీకంపోస్టులో ఎరువులను తయారు చేసి, విక్రయించి పంచాయతీకి ఆదాయం పెంచాలని ఈఓఆర్డీ అనంతసేన సూచించారు. గురువారం గోనెగండ్లలోని చెత్త సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ఈఓ సతీష్, సిబ్బంది మలాంగ్, సుభాన్, అనిల్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

గోనెగండ్ల : వాహనాలు నడిపే వారు రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సీఐ గంగాధర్ సూచించారు. గురువారం సాయంత్రం గాజులదిన్నె ప్రాజెక్టు స్టేజ్ వద్ద ఎమ్మిగనూరు, కర్నూలు ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనదారులకు పలు సూచనలు చేశారు.

సహకార వారోత్సవాలు ప్రారంభం



సహకార సంఘం జెండాను ఆవిష్కరిస్తున్న సంఘం సీఈఓ రవికుమార్

కోసిగి: మండల పరిధిలోని ఆర్లబండ సహకార పరపతి సంఘం కార్యాలయంలో 71వ సహకార వారోత్సవాలను సంఘం సీఈఓ రవికుమార్ ఆధ్వర్యంలో గురువారం జెండాను ఆవిష్కరించి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సహకార సంఘంలో తీసుకున్న రుణాలకు సకాలంలో చెల్లించి సంఘం అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సంఘం పరిధిలో ఉన్న రైతులందరూ ఆధార్ కార్డు, పాన్ కార్డు, పట్టదారు పాస్తు పుస్తకం జిరాక్స్‌లను కార్యాలయంలో అందజేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు హేమంత్ తదితరులు పాల్గొన్నారు.